క్లుప్తంగా

ట్రేడ్ లైసెన్స్ లేకుంటే చర్యలు



ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్

మల్కాపురం: దుకాణదారులు ట్రేడ్ లైసెన్స్ లేకుంటే చర్యలు తప్పవని 61వ వార్డు శానటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్ హెచ్చరించారు. వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో గల దుకాణదారుల్లో సచివాలయం శానటరీ సెక్రటరీ, మలేరియా తదితర సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. మల్కాపురం, ప్రకాష్‌నగర్, జనతా కాలనీ తదితర ప్రాంతాల్లోని దుకాణాల్లో సుమారు 12 కేజీల ప్లాస్టిక్ కవర్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వారి వద్ద ఉన్న ట్రేడ్ లైసెన్స్‌లను పరిశీలించారు.

కోలాట గురువుకు ఘన సత్కారం



కోలాట నృత్య గురువు లావణ్య యాదవ్‌ను సత్కరిస్తున్న సేవా సంఘం ప్రతినిధులు

మల్కాపురం: 61వ వార్డు మల్కాపురం, గొల్లవీధి ప్రాంతానికి చెందిన కోలాట నృత్య గురువు నూనెల లావణ్యయాదవ్‌ను స్థానిక గాంధీజీవీధి వినాయక సేవా సంఘం ప్రతినిధులు గురువారం ఘనంగా సత్కరించారు. గాంధీజీ వీధి వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సర్వసిద్ధి పైడిబాబుయాదవ్ మాట్లాడుతూ తనకు తెలిసిన కోలాట నృత్యాన్ని లావణ్య చిన్నారులకు ఉచితంగా నేర్పించడం అభినందనీయమన్నారు. చిన్నారులకు దైవభక్తిపై ఆసక్తి పెంచుకునే విధంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి హేయమైన చర్య



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఎన్‌ఏసీఈ అండ్ డబ్ల్యు యూనియన్ సభ్యులు

గోపాలపట్నం : ఉగ్రదాడికి నిరసనగా నేవల్ ఆర్మమెంట్ సివిల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు ఎన్ఏడీ మెయిన్ గేటు వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన గురువారం నిర్వహించారు. ఈ మేరకు ఉగ్రదాడిలో మృతి చెందిన సైనికులు, పౌరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ ఉగ్రదాడి హేయమైన చర్య అన్నారు. అమాయకుల్ని చంపడం చాలా దారుణమన్నారు. ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

రేపు బీచ్ కబడ్డీ పోటీలకు విశాఖ జట్ల ఎంపిక

ఎంవీపీకాలనీ: రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లాల పురుషులు, మహిళల జట్లను ఈ నెల 26న ఎంపిక చేయనున్నట్లు విశాఖ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జె.ఎస్.వి.ప్రసాదరెడ్డి తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం 3 గంటలకు ఆర్కే బీచ్ వేదికగా ఎంపిక జరుగుతుందన్నారు. 85 కేజీలలోపు పురుషులు, 75 కేజీలలోపు మహిళలు అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన జట్లు మే 2 నుంచి 4వ తేదీ వరకు కాకినాడ బీచ్‌లో జరిగే 12వ రాష్ట్ర అంతర్ జిల్లాల బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో విశాఖ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహి స్తాయన్నారు. వివరాలకు 96666 55355, 80084 85344 నంబర్లను సంప్రదించాలని సూచించారు

పాలిసెట్ హాల్ టికెట్లు సిద్ధం

మురళీనగర్: పాలిసెట్ హాల్ టికెట్లు సిద్ధంగా ఉన్నాయని విశాఖ జిల్లా పాలిసెట్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.నారాయణ రావు ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసిన వారు పాలిసెట్‌ఏపీ.ఎస్‌బీటీ.ఇన్ వెబ్ సైట్‌లో నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఇందుకోసం కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాలిసెట్‌కు జిల్లాలో సుమారు 14,000 మంది దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఈనెల 30 తేదీన ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తామని చెప్పారు.

నీటి చోరీ!

జీవీఎంసీ బోరు నుంచి నీటిని చోరీ చేసి, విక్రయిస్తూ లక్షలు ఆర్జిస్తున్నాడు కూటమికి చెందిన ఓ నాయకుడు. ఎమ్మెల్యే పేరుతోనే ఈ దందా సాగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో స్థానికులు మండిపడుతున్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.



కబ్జా చేసిన బోరు నీటిని వాటర్ ట్యాంకుల్లో నింపుతున్న సిబ్బంది

- జీవీఎంసీ బోరు కబ్జా
- టీడీపీ నాయకుడి నిర్వాకం
- బోరు నీటిని విక్రయిస్తూ లక్షల్లో సంపాదన
- ఎమ్మెల్యే పేరుతో కబ్జాలు, ఆపై దందాలు
- చోద్యం చూస్తున్న జోన్-5 అధికారులు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి దయానందనగర్ ముత్యమాంబ కాలనీలో మంచినీటిని చోరీ చేసి విక్రయిస్తున్నారు. కూటమికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, 166 బూత్ కన్వీనర్ నేతృత్వంలో చోటా నాయకులు ఈ బోరును కబ్జా చేసి, మంచినీరు చోరీ చేస్తూ భారీ మొత్తంలో వ్యాపారాలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు ముత్యమాంబ కాలనీలో టిడ్కో ఇళ్లు నిర్మించి ఇచ్చింది. మంచినీటి బోర్లు, సంపులు, వాటర్ ట్యాంకులు నిర్మించి నివాసితులకు నీటి సమస్య లేకుండా చూసింది. అంతవరకు బాగానే ఉన్నా.. ప్రజలకు అందాల్సిన మంచినీటిని దారి మళ్లించి,



స్థలాన్ని కబ్జా చేసి కూటమి నాయకుడు చర్చి పేరిట నిర్మిస్తున్న భవనం

దానిద్వారా వేలల్లో ఆదాయం ఆర్జిస్తున్నాడు ఓ టీడీపీ నాయకుడు. అక్కడికి సమీపంలోనే పోర్టు కాంట్రాక్ట్ ఉద్యోగాలు చేసుకుంటూ, పోర్టు రక్షణ గోడకు ఆనుకుని ఉన్న 15 రేకుల షెడ్లలో నివసిస్తున్న సుమారు 200 మందికి ఆ మంచినీటిని విక్రయించేందుకు పక్కాగా ఏర్పాట్లు చేసేశాడు. ఇందుకోసం జీవీఎంసీ అనుమతి లేకుండా మంచి నీటి బోరును తొలగించాడు. బోరు ట్యాప్, హ్యాండిల్ తీసేసి, సబ్‌మెర్సిబుల్ పంపును బోరులో దింపి, మోటారును అమర్చాడు. పైపులైన్ వేసి షెడ్లలో నివసిస్తున్న వారికి నీరు సరఫరా అయ్యేలా చేశాడు. దీనికోసం ఆ కాంట్రాక్ట్ కార్మికుల నుంచి అడ్వాన్స్‌గా రూ.లక్ష, ప్రతీ నెలా రూ.20 వేలు వసూలు చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఎమ్మెల్యే పేరుతో దందా

ఈ నాయకుడు ఎమ్మెల్యే గణబాబు పేరు చెప్పి వార్డులో దందాలు చేస్తున్నాడని పలువురు చెబుతున్నారు. ముత్యమాంబ కాలనీలో స్థలాన్ని కబ్జా చేసి చర్చి పేరిట భవనాన్ని నిర్మించడమే కాక, బోరు కబ్జా చేసి ఆ నీటితో వ్యాపారం చేస్తున్నాడు. తన దందాలకు ఎమ్మెల్యే గణబాబు పేరును వాడుకుంటున్నాడని స్థానికులు చెబుతున్నారు. ఎమ్మెల్యే పీఏతో మాట్లాడుతూ దందాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. పైగా ఇలాంటి నాయకుడికి మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ పదవి కూడా ఇవ్వడంతో, త్వరలోనే ప్రమాణస్వీకారం చేయనుండటం విశేషం. వీటిపై వార్డు టీడీపీ కార్పొరేటర్ శరగడం రాజశేఖర్‌కు స్థానికులు ఫిర్యాదులు చేసినా, తనకు సంబంధం లేదనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ఎమ్మెల్యే, వార్డు కార్పొరేటర్ స్పందించి, కబ్జాలతో దందాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



బోరు హ్యాండిల్ తొలగించి బిగించిన మోటారు

కాలనీవాసులకు నీటి ఇబ్బంది

మా కాలనీలో కూటమి నాయకుడు బోరును కబ్జా చేసి, మంచినీటితో వ్యాపారం చేస్తున్నారు. దీంతో కాలనీ ప్రజలకు మంచినీరు సక్రమంగా రాక ఇబ్బంది పడుతున్నారు. నీటిని చోరీ చేయడం, స్థలాలు కబ్జా చేయడం వంటివి చేస్తున్న వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకోవాలి.
– ఎస్.శంకరరావు, ముత్యమాంబకాలనీ, కంచరపాలెం

అధికారులు స్పందించాలి

ఇక్కడ కూటమి నాయకులదే హవా. కబ్జాల పేరిట దందాలు చేస్తూ, ప్రజా ప్రతినిధుల పేర్లు వాడుకుంటున్నారు. ధనార్జనే ధ్యేయంగా టీడీపీ నాయకుడు వ్యవహరిస్తున్నాడు. ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. ఇలాంటి వ్యక్తులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.
– ఆర్.శ్యామ్‌ప్రసాద్, దయానందనగర్, కంచరపాలెం

విద్యార్థుల విజయోత్సవ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, కార్పొరేటర్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 92శాతం ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా గురువారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి కొత్తపాలెం జంక్షన్ వరకు ప్రధానోపాధ్యాయిని రత్నమాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ ర్యాలీని నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ దాడి రమేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు. హెచ్‌ఎం రత్నమాల మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉత్తీర్ణత సాధిస్తున్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు



ఖాళీగా ఉన్న బీఆర్‌టీఎస్ రహదారి

గోపాలపట్నం: భానుడు భగభగలాడాడు. ఉదయం నుంచే సూరీడు భగ్గుమనడంతో బయటకు వచ్చేందుకు కూడా జనం భయపడ్డారు. మధ్యాహ్నం వేడి గాలులతో ఇబ్బంది పడ్డారు. అత్యవసరమైతే తప్ప రోడ్డుపైకి కూడా రాలేదు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. బీఆర్‌టీఎస్ రోడ్డుపై మధ్యాహ్నం 3.30 గంటలకు కూడా జనసంచారం కనిపించలేదు. సాయంత్రం 4.30 వరకు ఇదే పరిస్థితి కొనసాగింది.

ఘనంగా ముత్యమాంబ మారువారం



శాకాంబరి అలంకరణలో ముత్యమాంబ



అన్నసమారాధన ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గవర కంచరపాలెం వాసుల ఆరాధ్య దైవం ముత్యమాంబ అమ్మవారి మారువారం పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామాభ్యుదయ సంఘం గ్రామాధ్యక్ష, కార్యదర్శులు మళ్ల రాంప్రసాద్, మళ్ల గౌరీరమేష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు మజ్జిగ, శీతలపానీయాలు అందజేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనను కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ ఎమ్మెల్యే గణబాబు కుమారుడు మౌర్య ప్రారంభించారు. సుమారు 5వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం జరిగిన వేడుకల్లో పుట్టబంగారం వద్ద నుంచి అమ్మవారి ప్రతిమను ఆలయం వద్దకు చేర్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పాలకవర్గ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సాయి ఆలయంలో అన్న సమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సద్గురు షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 6 గంటలకు కాకడ ఆరతి, 8 గంటలకు బాబాకు పంచామృతాలతో అభిషేకాల అనంతరం పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2వేల మందికి అన్నదానం చేశారు. సాయంత్రం బాబాకు పల్లకీ సేవ నిర్వహించారు.

ఉగ్రదాడిపై నిరసనలు



బుచ్చిరాజుపాలెంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ సభ్యులు



నరవలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- పహల్గాం మృతులకు కొవ్వొత్తులతో నివాళులు

గోపాలపట్నం: పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిపై నిరసనలు వెల్లువెత్తాయి. పహల్గాం ఘటనలో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తూ శాంతి ర్యాలీలు నిర్వహించారు. జీవీఎంసీ 88వ వార్డు నరవలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాడి నూకరాజు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఉగ్రవాదుల దుశ్చర్యను తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో ఎస్.జగదీష్, ఎం. రాంబాబు, జువ్వల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ముష్కరులను మట్టు పెట్టండి

ముష్కరులను మట్టుపెట్టాలని డిమాండ్ చేస్తూ విశ్వ హిందూ పరిషత్ సభ్యులు 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వీహెచ్‌పీ ప్రతినిధి పూడిపెద్ద శర్మ మాట్లాడుతూ భారత్‌లో అశాంతిని రేకెత్తించేందుకు ఉగ్ర ముసుగులో హింసకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి వారిని మట్టు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ సామాజిక సమరసత అభియాన్ విశాఖ జిల్లా ప్రముఖ్ ఎం.రవీంద్ర, కొణతాల వరహా కోటి శ్రీనివాసరావు, వీహెచ్‌పీ 90వ వార్డు అధ్యక్షుడు పాలమరౌట్టి కోటేశ్వరరావు, స్థానికులు దొడ్డి సతీష్, దొడ్డి కనకరాజు, శరగడం అరుణ్ పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో 'బంగారు' తల్లులు

- జాతీయ స్థాయిలో స్వర్ణ పతకాలు




ఆటలాడుతున్న చిన్నారులు

చిత్రలేఖనంలో గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. ఇటీవల డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్ అకాడమీ సంస్థ విజయవాడలో 12వ జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహించింది. ఇందులో గోపాలపట్నం బాలికల హైస్కూల్ నుంచి 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో ఆరో తరగతి విద్యార్థి ఎం.సుస్మిత, ఏడో తరగతి విద్యార్థి కె. శార్వాణి, 9వ తరగతి విద్యార్థులు జె. లక్ష్మి, కె. రేష్మశ్రీ వేసిన చిత్రాలకు బంగారు పతకాలు దక్కాయి. బీచ్‌లో చిన్నారులు ఆడుకుంటున్న చిత్రం, జాతీయ సమైక్యత, తెలుగు సంప్రదాయ నృత్యాల చిత్రాలను బంగారు పతకాలు వరించాయి. మరో



ఐదుగురికి వెండి పతకాలు వచ్చాయి. పతకాలు సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం ప్రసాద్, డ్రాయింగ్ టీచర్ మోహనరావు అభినందించారు. – గోపాలపట్నం



బీచ్‌లో ఆటలాడుకుంటున్న బాలలు



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం ప్రసాద్, డ్రాయింగ్ టీచర్ మోహనరావు



సంప్రదాయ మహిళ

పోటీ ప్రపంచంలో సృజనాత్మకతే ప్రామాణికం



జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఎంపీ శ్రీభరత్



పదో తరగతి విద్యార్థులను సత్కరిస్తున్న అతిథులు

- విద్యార్థులు నైపుణ్యాలను వృద్ధి చేసుకోవాలి
- కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఎంపీ శ్రీభరత్
- మెగా జాబ్‌మేళా ప్రారంభం

గోపాలపట్నం: పోటీ ప్రపంచంలో నైపుణ్యం, సృజనాత్మకతే ప్రామాణికమని కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఎంపీ శ్రీభరత్ అన్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీలు పూర్తి చేసుకుని బయటకు వస్తున్నారు తప్ప నైపుణ్యాన్ని వృద్ధి చేసుకోవడం లేదన్నారు. ఈ పరిస్థితి మారాలని, విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

ఆలస్యంగా మొదలైన ఇంటర్వ్యూలు

అతిథులు ఆలస్యంగా రావడంతో జాబ్‌మేళా ఇంటర్వ్యూలు మధ్యాహ్నం 12 గంటలు దాటిపోయాయి. తొలుత పాఠశాల ఆవరణలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం సభ నిర్వహించారు.

54 కంపెనీలు హాజరు

ఈ జాబ్ మేళాలో 3వేల మందికి పైగా అభ్యర్థులు పాల్గొనగా, సుమారు 54 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఇక్కడికి వచ్చిన అభ్యర్థులు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసుకుని, ఎన్‌రోల్ చేసుకున్న తర్వాత ఏ కంపెనీకి వెళ్లాలో నిర్ణయించుకుని నమోదు చేస్తే, టోకెన్ నంబర్లు వస్తాయి. అలాగే మాన్యువల్‌గానూ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు.

టెన్త్ విద్యార్థులకు సత్కారం

ఇటీవల పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఎంపీ శ్రీభరత్ సత్కరించారు. సుమారు 10 మంది విద్యార్థులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు, జోనల్ కమిషనర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి



ర్యాలీగా వస్తున్న భవన నిర్మాణ కార్మికులు

సీతమ్మధార: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జిల్లా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఉదయం ద్వారకా నగర్ జంక్షన్ గురజాడ అప్పారావు విగ్రహం నుండి లలితా జ్యుయలరీ, ఆశీలమెట్ట జంక్షన్ మీదుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్ క్లెయిమ్‌లన్నీ చెల్లించాలని, కొత్త కార్డులు రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ధర్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్నా ఇంత వరకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోవడం అన్యాయం అన్నారు. ప్రభుత్వం సంక్షేమ బోర్డును గనుక పునరుద్ధరించకపోతే భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున చలో విజయవాడ నిర్వహిస్తామని హెచ్చరించారు. విశాఖ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు బలివాడ వెంకట్రావు, అధ్యక్షులు అనసూయ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కుమార్, నాయకులు పాల్గొన్నారు.

సెలవులపై వింత రూల్స్

- సెలవు పెడితే అవసరం లేని అధికారులకు చెప్పాలట
- కేజీహెచ్ సూపరింటెండెంట్ ఉత్తర్వులపై ఉద్యోగుల ఆగ్రహం

డాబాగార్డెన్స్ : కేజీహెచ్‌లో రోజుకో వింత రూల్ పుట్టుకొస్తుంది. ఈ రూల్స్‌తో ఉద్యోగులు, సిబ్బంది సతమతమవుతున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించే విషయంపై దృష్టి పెట్టని ఉన్నతాధికారులు.. పరిపాలన విభాగంలో లేనిపోని విధానాలు తెరపైకి తీసుకొచ్చి మానసికంగా వేధిస్తున్నారంటూ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ జారీ చేసిన ఉత్తర్వు మినిస్టీరియల్ ఉద్యోగుల్లో కలకలం రేపుతోంది. వాస్తవానికి ఏదైనా కార్యాలయంలో ఉద్యోగి సెలవు పెడితే ఆయా విభాగానికి సంబంధించిన ఉన్నతాధికారి నుంచి అనుమతి తీసుకుంటే సరిపోతుంది. పై స్థాయి అధికారులకు ఆ సమాచారం అందించాల్సిన అవసరం ఉండదు. కేజీహెచ్‌లో మినిస్టీరియల్ సిబ్బంది అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) పరిధిలో ఉంటారు. కార్యాలయంలోని మేనేజర్ సంతకంతో పాటు ఏడీ సంతకం తీసుకుని సెలవుకు వెళ్తే సరిపోతుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల్లో ఇదే విధానం అమలవుతోంది. కేజీహెచ్‌లో మాత్రం కింది స్థాయి ఉద్యోగి సెలవు పెడితే సూపరింటెండెంట్ అనుమతి తీసుకోవాలంటూ వింత రూల్ అమలు చేస్తున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.